క్లుప్తంగా

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారి

నార్నూర్: వర్షాకాలంలో వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని డీఎల్‌పీవో ప్రభాకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో గంగాసింగ్, ప్రిన్సిపాల్ ఆంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్ ఓదేలు ఉన్నారు.

‘ప్రభుత్వ బడులపై కాంగ్రెస్ చిన్నచూపు’



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వ బడులపై కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ ఆరోపించారు. గురువారం మండలంలోని లక్కారం జిల్లా పరిషత్ పాఠశాల, గంగన్నపేట ప్రాథమిక పాఠశాలలను సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. లక్క పురుగులతో కూడిన దొడ్డు బియ్యం పిల్లలకు మధ్యాహ్న భోజనం పెడుతున్నారని మండిపడ్డారు. భోజన కార్మికులకు బీఆర్‌ఎస్ హయాంలో ప్రతీ నెల వేతనం జమ చేయడం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రూ. 1000 కూడా ఇవ్వడం లేదన్నారు. ఆయన వెంట నాయకులు మహమ్మద్ ముజీబ్, సత్తన్న, సాజిద్, జయచంద్ర, సూర్యకాంత్ ఉన్నారు.

నేడు పైలట్ ప్రజావాణి

గుడిహత్నూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పైలట్ ప్రజావాణి కార్యక్రమం స్థానిక రైతువేదికలో శుక్రవారం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందని ఎంపీడీవో అబ్దుల్‌హై ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని అర్జీదారులు తమ సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

స్కూల్ బ్యాగులు, గొడుగులు అందజేత

బేల: మండలంలోని మాంగ్రుడ్ గ్రామంలో గిరిజన సంక్షేమ తెలుగు, మండల పరిషత్ మరాఠీ మీడియం ప్రాథమిక పాఠశాలల్లో 60 మంది విద్యార్థులకు గురువారం మహేశ్వరి మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు, గొడుగులు అందజేశారు. ఆ కంపెనీ మేనేజర్ సుజీత్ బెనర్జీ, మాజీ ఎంపీటీసీ ఠాక్రే మంగేష్, ఉపాధ్యాయులు మహేందర్, సందీప్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ విద్యబాయి, తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన 50 ఏళ్ల మహిళ అదృశ్యమైనట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈనెల 25న ఆసియా అనే మహిళ తన ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రాత్రి వరకు తిరిగి రాలేదు. దీంతో చుట్టుపక్కల గాలించినా ఆమె ఆచూకీ లభించలేదు. భర్త షేక్ జావిద్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

తెరుచుకోని పాఠశాలలు

- పునః ప్రారంభం కాని తొమ్మిది బడులు
- పట్టించుకోని ఐటీడీఏ అధికారులు
- చదువుకు దూరం అవుతున్న చిన్నారులు



తెరుచుకోని పున్నగూడ పాఠశాల

నార్నూర్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం విద్యాశాఖ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని చేపడుతోంది. అలాగే పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అమ్మఆదర్శ కమిటీ ద్వారా చర్యలు తీసుకుంటున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పేద విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగానే మారింది. బడిబాటలో భాగంగా ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ.. ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ తీసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. కానీ ఏజెన్సీ ప్రాంతాల్లోని మారుమూల గ్రామాల్లో ఉపాధ్యాయులు లేక పాఠశాలలు నేటికి తెరుచుకోలేదు. దీంతో విద్యార్థులు ఆరుబయటే జులాయిగా తిరుగుతున్నారు. గాదిగూడ మండలంలోని ఐటీడీఏ పరిధిలోని పున్నగూడ, హీరాపూర్, పిప్రి, సావరి, లోద్దిగూడ, కట్టగూడ, సాంగ్విపున్నగూడ, రాజులగూడ, ముత్యంభట్టి గ్రామాల్లో 9 పాఠశాలలు నేటికి తెరుచుకోలేదు. ఉపాధ్యాయులు లేకపోవడంతో పాఠశాలలు మూతపడి ఉన్నాయి. ఒకొక్క పాఠశాలలో 20 నుంచి 30 మంది ఆదివాసీ గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నారు. గతేడాది సైతం ఇదే పరిస్థితి ఉండడంతో తాత్కాలికంగా సీఆర్టీలను సర్దుబాటు చేసి పాఠశాలలను తెరిపించారు. కొన్ని పాఠశాలలను అంగన్‌వాడీ కేంద్రాలకు ఆటాచ్ చేశారు. ఈవిద్యా సంవత్సరం పాఠశాలలు ప్రారంభమై దాదాపు 14 రోజులు అవుతున్నా.. ఇంకా పాఠశాలలు పునః ప్రారంభంపై అధికారులు దృష్టి సారించ లేదు. పాఠశాలలు లేక విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారు. ఎక్కడైనా ప్రైవేట్‌లో చదివి ద్దామంటే వారికి ఆర్థిక స్తోమత ఉండడం లేదు. ఐటీడీఏ పీవో స్పందించి పాఠశాలలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటాం

గాదిగూడ మండలంలోని ఐటీడీఏ పరిధిలో ఉపాధ్యాయుల లేని పాఠశాలల వివరాలను తెప్పించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటాం. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూస్తాం. వెంటనే పాఠశాలలు తెరుచుకునేలా చర్యలు ప్రారంభిస్తాం.

– ఖుష్బూగుప్తా, ఐటీడీఏ పీవో, ఉట్నూర్

తప్పని దారి కష్టాలు

- అనారోగ్యానికి గురైతే ఇక అంతే సంగతి



రోగిని వాగు దాటిస్తున్న గ్రామస్తులు

ఆదిలాబాద్‌రూరల్: వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆ గ్రామ ప్రజల సమస్య వర్ణతీతం. వర్షాలు కురిస్తే గ్రామానికి వెళ్లే దారిలో వాగులు పొంగి పొర్లుతాయి. అత్యవసర సమయంతో పాటు నిత్యావసర సరుకుల కోసం ప్రజలు ఆదిలాబాద్ పట్టణానికి రావాల్సిందే. ఈ గ్రామం ఎక్కడో మారుమూల గ్రామం కాదు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చిట్యాల్‌బోరి గ్రామం. పాలకుల నిర్లక్ష్యంతో కష్టాలు తప్పడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోగి వాగులో నుంచి నడవాల్సిందే..

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చిట్యాల్‌బోరి గ్రామానికి చెందిన ప్రజలు కచికంటి, చింతల్‌బోరి గ్రామం మీదుగా రాకపోకలు నిర్వహిస్తుంటారు. అయితే కచికంటి గ్రామ సమీపంలోని వాగుతో పాటు చింతల్‌బోరి రోడ్డు మార్గంలో రెండు వాగులు ఉన్నాయి. ఏ చిన్నపాటి వర్షం కురిసినా.. ఆయా మార్గంలోని వాగులు పొంగిపోర్లుతాయి. వాగులపై వంతెనలు లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. గ్రామానికి చెందిన తొడసం గంగారాం, సలాం మంతులు అనారోగ్యాల బారిన పడ్డారు. వీరికి చికిత్స కోసం ఆదిలాబాద్ పట్టణానికి తీసుకువచ్చేందుకు గురువారం కాలినడకన వాగు దాటించారు.

రాథోడ్ సందీప్ మరణం బాధాకరం

నేరడిగొండ: రాథోడ్ సందీప్ మరణం బాధాకరమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని సవర్గావ్ గ్రామానికి చెందిన రాథోడ్ ఇందల్ కుమారుడు రాథోడ్ సందీప్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన గురువారం సవర్గావ్‌లోని వారి నివాసానికి చేరుకొని సందీప్ పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ సర్పంచ్ మహేందర్ ఉన్నారు.

పరామర్శ

ఇచ్చోడ: మండల కేంద్రానికి చెందిన నిమ్మల గోవర్ధన్ రెడ్డి మాతృమూర్తి ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బాధిత కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీలు ప్రీతం రెడ్డి, రాథోడ్ సజన్, మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, శిరీష్ రెడ్డి, దేవేందర్ రెడ్డి ఉన్నారు.

గిరిజనుల ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న గిరిజనులు

ఉట్నూర్‌రూరల్: గిరిజన గ్రామాల్లో అకాడి పూజలు ప్రారంభమయ్యాయి. బుధవారం మండలంలోని మత్తడిగూడ గిరిజనులు సమీప అడవి ప్రాంతంలో ‘అకాడి రాజుల్ పేన్’ కు ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజలు చేస్తే ఎలాంటి ఆపాయం జరగదని గిరిజనుల నమ్మకం. పశువుల మెడలోని గజ్జెల దండా, వ్యవసాయ పనిముట్లకు ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం అక్కడే వంటలు వండి సహంపక్తి భోజనాలు చేస్తారు. కార్యక్రమంలో గ్రామపటేల్ సిడాం రాంషావ్, సోనేరావు, జంగుదేవ్, పంద్ర ఆనందరావు, ఆత్రం సూర్యరావు పాల్గొన్నారు.

అంజీ గ్రామంలో ‘జన్‌మన్’



జన్‌మన్ కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: మండలంలోని అంజీ గ్రామంలో గురువారం జన్‌మన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానమంత్రి జన జాతీయ ఆదివాసీ న్యాయ మహా అభియాన్, ధర్తి జన జాతీయ అభియాన్, గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకాలపై అవగాహన కల్పించారు. గిరిజనుల నుంచి రేషన్ కార్డులు, ఒంటరి మహిళ పింఛన్, కుల ధ్రువీకరణ పత్రాలు, విద్యుత్ బిల్లులు, వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. అదే విధంగా మొబైల్ వాహనం ద్వారా వైద్య సేవలు, రక్త పరీక్షలు నిర్వహించి వ్యాధులు నిర్ధారించి చికిత్స అందించారు. జన్‌మన్ కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, ఎస్‌సీఆర్‌పీ పెందోర్ అర్జున్, ఏఈవో వివేక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహాత్ముడి స్ఫూర్తిగా ప్రజాపాలన

- రాష్ట్ర మంత్రులు జూపల్లి, వివేక్



మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రులు జూపల్లి, వివేక్, ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

కైలాస్‌నగర్: అహింస మార్గంలో శాంతియుతంగా స్వాతంత్రం తెచ్చిన మహాత్మా గాంధీ స్ఫూర్తితో ప్రభుత్వం ప్రజాపాలన సాగిస్తుందని మంత్రులు జూపల్లి కృష్ణారావు, జి.వివేక్ అన్నారు. గురువారం తొలిసారి జిల్లా పర్యటనకు వచ్చిన వారికి మావల బైపాస్ వద్ద కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి బైక్ ర్యాలీగా జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. కుమురంభీం చౌక్‌లోని భీం విగ్రహానికి, గాంధీ పార్కులోని మహాత్మా గాంధీ విగ్రహానికి, జగ్జీవన్ రాం, అంబేద్కర్ చౌక్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లాలోని ఆదివాసీల పరిస్థితులను మెరుగుపరిచి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు, కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జిలు కంది శ్రీనివాస్ రెడ్డి, ఆడే గజేందర్, బోరంచు శ్రీకాంత్ రెడ్డి, నాయకులు నరేష్ జాదవ్, ఆత్రం సుగుణ, గోక గణేష్ రెడ్డి, శ్యాం నాయక్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

తలమడుగు: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యంమని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎమ్మెల్సీ దండే విఠల్‌తో కలిసి ప్రారంభించారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఎంపీ నగేశ్ మాట్లాడుతూ.. జిల్లా వెనుకజలో ఉందని, అభివృద్ధికి నిధులు కేటాయించాలన్నారు. ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మాజీ కేంద్రమంత్రి వేణుగోపాల చారి, డీసీసీడీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆడే గజేందర్, కంది శ్రీనివాస్ రెడ్డి, గోక గణేష్ రెడ్డి, కళ్యాణ లక్ష్మి రాజేశ్వర్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..



బజార్‌హత్నూర్: గత రెండు రోజులు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండల కేంద్రంలోని పశువైద్యశాల ఆవరణలో వర్షపు నీరు చేరి చిత్తడిగా మారింది. గురువారం పశువులకు వైద్య చికిత్స చేయించేందుకు వచ్చిన రైతులు ఇబ్బంది పడ్డారు. అధికారులు స్పందించి చిత్తడి లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

మంత్రి ‘జూపల్లి’కి ఘన స్వాగతం



మంత్రి జూపల్లి కృష్ణారావుకు స్వాగతం పలుకుతున్న ఆడే గజేందర్

నేరడిగొండ: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా తొలిసారిగా జిల్లాకు వచ్చిన జూపల్లి కృష్ణారావుకు కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఘన స్వాగతం పలికారు. గురువారం జిల్లాకు చేరుకున్న మంత్రికి నేరడిగొండ మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద కాంగ్రెస్ నాయకులతో కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. మంత్రి పర్యటనతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం కనిపించింది. జిల్లా పర్యటనలో భాగంగా మంత్రి జూపల్లి కృష్ణారావు ఆడే గజేందర్ క్యాంప్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: జిల్లా పర్యటనలో భాగంగా మండల కేంద్రానికి చేరుకున్న మంత్రి జూపల్లి కృష్ణారావుకు స్థానిక కాంగ్రెస్ నాయకులు స్థానిక బస్టాండ్ వద్ద ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ఆడే శీలా, కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.

సొనాల సమస్యలు పరిష్కరించండి

బోథ్: ఆదిలాబాద్ జిల్లాకు వచ్చిన ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును బోథ్, సొనాల మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు నేరడిగొండలో కలిసి, శాలువాతో సత్కరించారు. అనంతరం సొనాల మండల నాయకులు మండలంలో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మండలంలో పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు, ఆదివాసీ గ్రామాల్లో సెల్ టవర్ల నిర్మాణం, రోడ్డు నిర్మించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

మాదకద్రవ్యాలను అరికట్టాలి



ఇచ్చోడ: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

ఇచ్చోడ: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఇచ్చోడ సీఐ బండారి రాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తుకు బానిస కాకుండా చదువుపై దృష్టి పెట్టాలన్నారు. అలాంటి విషయాల జోలికి వెళ్లి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. ఎస్సై పురుషోత్తం, పోలీస్ సిబంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు బానిస కావద్దు

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులు డ్రగ్స్‌కు బానిస కావద్దని ఉట్నూర్ ఎస్సై మనోహర్ అన్నారు. గురువారం స్థానిక సెయింట్ పాల్ పాఠశాల విద్యార్థులు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వినోద్ అలెగ్జాండర్, ప్రిన్సిపాల్ సిమి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాంసి: మాదకద్రవ్యాల బారిన పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎంఈవో శ్రీకాంత్ సూచించారు. గురువారం మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. మద్యం, సిగరేట్, డ్రగ్స్ వంటి బారిన యువత పడవద్దన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రామారావు, రాజు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు సతీశ్, అనిల్ పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో..

బజార్‌హత్నూర్: సమాజంలో మాదకద్రవ్యాల ప్రభావం చాలా ప్రమాదకరం, నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. గురువారం పాఠశాల ఆవరణలో మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సంగీత, నిఖత్ జరిన్, నరేశ్, రాజేశ్వర్, అభిలాష్, సత్యనారాయణ, సంతోష్ పాల్గొన్నారు.

నార్నూర్: మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎస్సై అఖిల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నుంచి మార్కెట్ గాంధీచౌక్ వరకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. యువత ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసే మాదకద్రవ్యాల వినియోగాన్ని రూపుమాపేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రిన్సిపాల్ అంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్ ఓదేలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వ బడులు కళాశాలలు పరిరక్షణ కోసం 27న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నాలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగ్‌రావు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని లక్ష్మెటిపేట ఆశ్రమ పాఠశాల ఆవరణలో కరపత్రాలు ఆవిష్కరించారు. జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలని, పాఠశాలల విద్యా వ్యవస్థను ధ్వంసం చేసే విధానాన్ని మానుకోవాలని, కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్లో 10 శాతం రాష్ట్ర బడ్జెట్లో కనీసం 20 శాతం విద్యకు కేటాయించాలన్నారు. నాయకులు రమేశ్, విజయ్, నాగో రావు, సురేశ్, బారరావు, కైలాస్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని ముసురు



నీట మునిగిన సోయా పంటను చూపిస్తున్న రైతు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో రెండు రోజులుగా ఎడతెరిపి లేని వర్షం కురుస్తుంది. మండలంలోని సుందర్‌నగర్, భగత్‌సింగ్, చిత్తబట్ట, మామిడిగూడ, గోపాల్‌పూర్, పాల్లుగూ గ్రామాల మట్టిరోడ్లు చిత్తడి మారడంతో వాహనదారులు, ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. అధికారులు, ప్రజాతినిధులు దృష్టి సారించి బీటీ రోడ్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

రైతులను నీట ముంచిన వర్షాలు

జైనథ్: బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు రైతుల పంట పొలాలు నీట మునిగాయి. ఏమి చేయాలో తెలియని పరిస్థితిలో రైతులు అయోమయంలో పడ్డారు. వేలకు వేలు పెట్టుబడులు పెట్టి వ్యవసాయం సాగు చేస్తుంటే తీరా పంట పెరుగుతున్న సమయంలో నీటి మునిగిందని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు ఇలా కొనసాగితే భారీగా నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు.

మత్తడివాగు ప్రాజెక్టుకు జలకళ



సాత్నాల: వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరదనీరు

తాంసి: మండలంలోని వడ్డాడి మత్తడివాగు ప్రాజెక్టులోకి గురువారం వరదనీరు రావడంతో ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో చెరువులు, కుంటలు, వాగుల్లోకి వరదనీరు వచ్చి చేరింది. ఇన్‌ఫ్లో ద్వారా 1030 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరగా ప్రాజెక్టు నీట్టిమట్టం స్వల్పంగా పెరిగింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.5 మీటర్లు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 273 మీటర్లకు చేరినట్లు ఏఈ హరీశ్ తెలిపారు.

కరంజి వాగుకు..

భీంపూర్: మండలంలోని కరంజి(టి) గ్రామ సమీపంలోని వాగు గురువారం నీటి ప్రవాహంతో ఉప్పొంగి ప్రవహించింది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు ఒక్కసారిగా వరద నీరు రావడంతో వాగు జలకళను సంతరించుకుంది. దీంతో లోతట్టు ప్రాంతాల పంట పొలాలు పూర్తిగా జలమయమయ్యాయని రైతులు వాపోతున్నారు.

నిలిచిన రాకపోకలు..

సాత్నాల: భోరజ్ మండలంలోని తర్ణంలో లో లెవెల్ వంతెన వద్ద చినుకు పడితే రాకపోకలు నిలిచిపోతున్నాయి. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. రూ. 4.5 కోట్ల లోలెవల్ వంతెన ఇష్టారాజ్యంగా నిర్మించారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్



పోలీసుల అదుపులో బీఆర్‌ఎస్ నాయకులు

జైనథ్: బేల మండలంలో రాష్ట్ర మంత్రుల పర్యటన ఉండడంతో ముందస్తుగా జైనథ్ మండల బీఆర్‌ఎస్ నాయకులను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ కార్యదర్శి గణేష్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సంపూర్ణ రుణమాఫీ చేయలేదన్నారు. రైతులను నిండా మించిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, స్వామి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.